

హర్షిత్‌కు మొక్కను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ అనుదీప్

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హోలీ వర్డ్స్ పాఠశాల డైరెక్టర్ అనుదీప్ అన్నారు. పర్యావరణ జాతీయ అవార్డు పొందిన విద్యార్థి దైద హర్షిత్‌కు శుక్రవారం పాఠశాలలో మొక్కను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హర్షిత్ చిన్న వయసులోనే మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకున్నారని, ఇప్పటికే అనేక ప్రాంతాల్లో మొక్కలు నాటినట్లు తెలిపారు. విద్యార్థులందరూ హర్షిత్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలకు చేయూత

గార్ల, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్నారై మైనంపాటి మురళీ శైలజారెడ్డి దంపతుల తండ్రి హనుమంతారెడ్డి జ్ఞాపకార్థం రూ.లక్షతో స్టేజిని నిర్మించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎన్నారై దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకుడు అప్పయ్య, ఉపాధ్యాయులు సుందర్‌కుమార్ పాల్గొన్నారు.




బాలికల ఉన్నత పాఠశాలలో స్టేజ్ నిర్మించిన ఎన్నారై మురళీశైలాజారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

# ఉపాధి హామీ కార్డులకు చెక్

- నూతన కార్డులు ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో లాక్ చేసిన సర్కార్
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంతో పెరిగిన డిమాండ్
- కార్యాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు

డోర్నకల్, ఫిబ్రవరి 28 : వేసవి కాలంలో కూలీలకు పని కల్పించేందుకు కేంద్రం ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నది. దీంతో వలసలను నివారించి స్థానికంగా మూడు నెలలపాటు కల్పించి జీవనోపాధికి చేయూతనిస్తున్నది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ కార్డుల లింకుతో ప్రవేశపెట్టిన ఒక కొత్త పథకం ఆందోళన కలిగిస్తున్నది. అర్హులైన వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బందిపడుతున్నారు ఫాంలు పట్టుకొని మండల ప్రజాపరిషత్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయినా, నూతన కార్డులు మంజూరు కావడం లేదు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12 వేలు రావాలంటే ఉపాధి హామీ కార్డు (జాబ్ కార్డు) కలిగి ఉండడంతోపాటు కనీసం 20 రోజులు పని చేయాలనే నిబంధనలు ప్రభుత్వం పెట్టింది. దీంతో అర్హులంతా ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్ జీరాక్స్ ప్రతులను ఉపాధి కార్డు ఫారానికి జాత చేసి దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అతికొద్ది రోజుల్లోనే వేలల్లో దరఖాస్తులు రావడంతో సర్కారు ఉపాధి హామీ కార్డుల జారీ ప్రక్రియకు చెక్ పెట్టేందుకు ఆన్‌లైన్ లాక్ చేసింది. ఉపాధి కార్డుల కోసం ఎంపీడీవో ఆఫీస్ చుట్టూ తిరుగుతున్న వారికి అధికారులు ప్రభుత్వమే జారీ ప్రక్రియను నిలిపివేసిందని సమాధానం చెబుతున్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులు దూరమవుతున్నారు. దీంతోపాటు యాక్టివ్‌గా లేని కార్డులను తొలగించాలని ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు కూడా పేదలకు అన్యాయం చేసేలా ఉన్నాయి. ఉపాధి కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందోనని అర్హులు వేసి చూస్తున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

### ఉపాధి కార్డులను జారీ చేయాలి



ఉపాధి పథకం కింద అర్హులైన కూలీలందరికీ కొత్తజాబ్ కార్డులు జారీ చేయాలి. కొత్తకార్డులను ఇతర కారణాలతో ప్రభుత్వం నిలిపివేయడం సరికాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధి జరగాలంటే ఉపాధి కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలి. కాలయాపన చేయొద్దు

సీపీఎం మండల కార్యదర్శి ఉప్పెనపల్లి శ్రీనివాస్, అమ్మపాలెం

## తాగునీటి సమస్య రాకుండా చూడాలి

కేసముద్రం: వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన రంగాపురం గ్రామంలో మిషనగ్ భగీరథ పైపులైన్ లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. గృహాలు, హాస్టళ్లకు షెడ్యూల్ ప్రకారం నీటి సరఫరా చేయాలన్నారు. అధికారులు, సిబ్బందిరి సమన్వయం చేసుకుంటూ సమస్య ఉత్పన్నం కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



లీకేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



దంతాలపల్లి: ఫర్టిలైజర్ షాపుల్లో రిజిస్టర్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల

## యూరియా కొరత లేకుండా చూడాలి

దంతాలపల్లి, ఫిబ్రవరి 28 : రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల సూచించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించొద్దన్నారు. ప్రతి దుకాణం ఎదుట నిల్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాహిని, ఏఈవో దీక్షిత్‌కుమార్ పాల్గొన్నారు.

## హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు

ఇనుగుర్తి, ఫిబ్రవరి 28 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఏఐసీటీయూ రాష్ట్ర కార్యదర్శి రాయబండి పాండురంగాచారి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ఏఐసీటీయూ జిల్లా రెండో మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ, వారి హక్కులను హరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గత ఐదురోజులుగా టన్నెల్‌లో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుంటే సీఎం, మంత్రులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కార్మికలోకం కన్నెర్ర చేస్తే ఎంతటి ప్రభుత్వాలైనా కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, సహాయ కార్యదర్శి ఉపేందర్, ఏఐసీటీయూ నాయకులు వేల్పుల వెంకన్న, సత్యనారాణ, వీరేశ్, మహేందర్, రమేశ్, మల్లయ్య పాల్గొన్నారు.

## వాటర్‌ప్లాంట్ అందజేత

కురవి, ఫిబ్రవరి 28 : వాసవీ క్లబ్ కపుల్స్ సేవా కార్యక్రమంలో భాగంగా కురవి ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో సుమారు రూ.45వేలతో శాశ్వత తాగునీటి వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వాసవీ క్లబ్ కపుల్స్ అధ్యక్షుడు నాళ్ల వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యోగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జంగాల విజయ్, ట్రెజరర్ వనమాల సురేశ్, సీనియర్ కో ఆర్డినేటర్ వల్లాల రమేశ్, వాసవీ క్లబ్ సభ్యులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, సదాశివుడు, అంబరీష, విజయ్, నవీన్, శ్రీనివాసరావు, మాలే నవీన్ పాల్గొన్నారు.

**మేచరాజుపల్లిలో..**

నెల్లికుదురు, ఫిబ్రవరి 28 : రిటైర్డ్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంపత్‌రావు సేవా దృక్పథం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి రాందాస్ అన్నారు. మండలంలోని మేచరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించి, గత అక్టోబర్ నెలలో రిటైర్డ్ అయిన సంపత్‌రావు రూ.32వేల విలువైన మినీ వాటర్ ప్లాంట్‌ను పాఠశాలలో ఏర్పాటు చేయగా, శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి రాందాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాగి రమేశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం జే మంగతాయి, స్వామి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

ఇనుగుర్తి, ఫిబ్రవరి 28 : మండల కేంద్రానికి చెందిన గంజి కొమురారెడ్డి అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆయన భౌతికాయానికి శుక్రవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వద్దిరాజు కిషన్ పూలమాలవేసి నివాళులర్పించారు. కొమురారెడ్డి కొడుకు సురేందర్‌రెడ్డి, కూతురు స్వప్నను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## నియోజకవర్గ ఇన్‌చార్జిగా కుమార్

డోర్నకల్, ఫిబ్రవరి 28 : ఎల్‌హెచ్‌పీఎస్ ఏక్ మత్రో డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ధరావత్ కుమార్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మంగీలాల్‌నాయక్‌కు కుమార్ నియమాక పత్రం అందజేశారు. తన ఎన్నికకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోత్ రామ, రాజారాం, తేజావత్ శ్రీను, బాల పాల్గొన్నారు.

## రోడ్డు రోలర్ అపహరణ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 : రోడ్డు రోలర్ చోరీకి గురైన ఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టర్ రోడ్డు రోలర్‌ను పట్టణంలోని కురవి గేటు సమీపంలో బ్రిడ్జి కింద పెట్టారు. కొంతకాలంగా అక్కడే ఉంటున్నది. కొంత మంది కలిసి దానిని ఎలాగైనా అపహరించాలని ప్లాన్ వేశారు. ఓ సివిల్ కాంట్రాక్టర్ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి పట్టణంలోని ఓ ఇనుప సామగ్రి దుకాణంలో రూ.2.19 లక్షలకు అమ్మారు. అమ్మిన వెంటనే రోడ్డు రోలర్‌ను జేసీబీ సహాయంతో ఇనుప కొట్టు వద్దకు తీసుకెళ్లారు. ఇనుప కొట్టులో రోలర్‌ను గ్యాస్ కటింగ్ ద్వారా ముక్కలు చేస్తున్న క్రమంలో అసలు యజమాని సమాచారం తెలుసుకొని ఇనుప కొట్టు వారికి ఫోన్ చేసి, రోడ్డు రోలర్ తనదేనని, చోరీ చేసి అమ్మినట్లు చెప్పారు. రోడ్డు రోలర్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

# బకాయిలు వెంటనే చెల్లించాలి

### ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్

తొర్రూరు, ఫిబ్రవరి 28 : తమ బకాయిలను త్వరగా చెల్లించాలని కోరుతూ తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతికి ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు గట్టు ప్రభాకర్, రామచంద్రయ్య, సోమన్న మాట్లాడుతూ.. తొర్రూరు ఆర్టీసీ డిపోలో సుమారు 130 మందికి పైగా రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారని, వారికి పెండింగ్‌లో బకాయిలు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ఒక్కో ఉద్యోగికి సుమారు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకన్న, కార్యదర్శిగా గూడెల్లి రామచంద్రయ్య, కోశాధికారిగా కేవీ స్వామి బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య సలహాదారులుగా సీహెచ్ వెంకన్న, డీవీ స్వామి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి నన్నపునేని రాజు, చంద్రయ్య, వెంకన్న, గట్టు ప్రభాకర్, దీకొండ వెంకన్న పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

# హామీలు అమలు చేయకపోతే ఉద్యమిస్తాం



జిల్లా సదస్సులో మాట్లాడుతున్న కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ

దంతాలపల్లి, ఫిబ్రవరి 28 : కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఊరూరా ఉద్యమిస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో గుండాగని లింగయ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 22 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ఏడాది కాలంలో మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని విమర్శించారు. గీత కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ప్రమాదం జరిగిన కార్మికులకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా ఏడాది నుంచి ఇవ్వలేదన్నారు. మార్చిలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో గీత కార్మికులకు రూ.5వేల కోట్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య సలహాదారులు మోహన్, జిల్లా అధ్యక్షుడు వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు అంజయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాము, మండల ప్రధాన కార్యదర్శి తండా చిన్న రాములు, కొత్త అంత్తయ్య, కొమురెల్లి, ఉప్పలయ్య, యాకన్న, మధు, మల్లేశం పాల్గొన్నారు.



డోర్నకల్: రాజుతండా సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో ఎగ్జిబిట్‌లను పరిశీలిస్తున్న సీఐ రాజేశ్



కేసముద్రం: విద్యార్థుల ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రాజు



నెల్లికుదురు: ఎగ్జిబిట్‌ను తిలకిస్తున్న ఎంఈవో రాందాస్

## ఘనంగా సైన్స్ దినోత్సవం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినత్సోవాన్ని ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టి తయారు చేసిన ఎగ్జిబిట్లను పాఠశాలల ఆవరణల్లో ప్రదర్శించారు. శాస్త్రీయ ప్రదర్శనలు, సైన్స్ రంగోలి, ఉపన్యాసం, వ్యాస రచన, డ్రాయింగ్, క్విజ్ వంటి విభిన్న కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్‌పై అవగాహ పెంచుకోవాలన్నారు. నూతన ఆవిష్కరణలతో సమాజాన్ని జాగృతం చేయాలన్నారు.

## వైద్య సిబ్బందితో సమీక్ష

మరిపెడ : ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని వైద్యాధికారి గుగులోత్ రవి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం దవాఖానలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు ప్రభుత్వ దవాఖానలో మొదటి మూడు నెలలో నమోదయ్యేలా చూడాలన్నారు. ప్రతి బుధ, శనివారాల్లో పిల్లలకు వ్యాక్సిన్ వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ప్రతి గ్రామం లో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, సుదర్శన్, ఆచార్యులు పద్మ, లక్ష్మి, పల్లె దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 : అంకితభావంతో పనిచేస్తే దానంతటదే గుర్తింపు లభిస్తుందని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విధులు నిర్వర్తించిన మహ్మమద్ సాబీరఅలీ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. విద్యాశాఖలో వృత్తి ధర్మాన్ని పాటిస్తూ నిబద్ధతతో సేవలను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ రాజేశ్వర్, మందుల శ్రీరాములు, పూర్ణచందర్, చద్రశేఖర్, సంతోష్, సతీశ్, బిందు, రాజశ్రీ పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్ : జిల్లాలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. మార్చి 05 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటర్ ప్రశ్న పత్రాలు రేపటి నుంచి స్ట్రాంగ్ రూమ్‌లను నుంచి పోలీస్‌స్టేషన్‌కు చేరుతాయన్నారు. సంబంధిత జవాబు పత్రాలు పోస్టల్ ద్వారా పంపే వరకు జిల్లాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎల్ఆర్‌ఎస్ ప్రక్రియను సులభం చేసేందకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకున్నదని, ఎల్ఆర్‌ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుమును చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చునని తెలిపారు. మార్చి 31 వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే రుసుములో 25 శాతం మినహాయింపు ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, మదార్, గణేష్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 : హమాలీ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న కోరారు. శుక్రవారం పట్టణంలో వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మిల్లులు, వ్యవసాయ మార్కెట్లలో పనిచేస్తున్న హమాలీలకు కేవలం మూడు నెలలు మాత్రమే పని ఉంటున్నదన్నారు. వారికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని, 50 సంవత్సరాలు పైబడిన వారికి రూ.6వేలు పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవి, లాలు, లక్ష్మణ్, లచ్చు, కోటి సునీత, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్యకు ఎస్జీటీలే మూలస్తంభాలు

మహబూబాబాద్ రూరల్ : ప్రాథమిక విద్యకు ఎస్జీటీలే మూలస్తంభాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. 2024లో డీఎస్సీలో ఎంపికైన టీచర్లకు ఇండక్షన్ ప్రోగ్రాంను శుక్రవారం పట్టణ శివారు అనంతారం ఆదర్శ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే ఉపాధ్యాయులు నిరంతరం తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఆజాద్, డీఆర్పీలు ప్రవీణ నాగముని, రమేశ్, శివప్రసాద్, సారంగం పాల్గొన్నారు.

## తునికాకు సేకరణకు టెండర్లు చేపట్టాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 : తునికాకు సేకరణకు తక్షణమే టెండర్లు చేపట్టాలని రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు బండపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా, అనంతరం ఎమ్మార్వో భగవాన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 50 ఆకుల కట్టకు రూ.6ల చొప్పున చెల్లించాలని, తునికాకు సేకరణ జరుగే అన్ని రకాల పనులను ప్రభుత్వమే చూసుకోవాలన్నారు. తునికాకు సేకరణలో ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, భిక్షపతి, రాములు, వెంటకయ్య పాల్గొన్నారు.

## క్రషర్ మిల్లును మూసి వేయాలి

కురవి, ఫిబ్రవరి 28 : అసైన్డ్ భూమిలో అక్రమంగా గుట్టలను కొల్లగొడుతున్న క్రషర్ మిల్లును మూయించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ప్రతినిధి బృందం కురవి శివారులోని గుట్టలను పరిశీలించి మాట్లాడారు. 188 సర్వే నంబర్‌లో ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూమిని లీజుకు తీసుకొని తమ పట్టా భూమిలో క్రషర్‌మిల్లు పెట్టి ప్రభుత్వ గుట్టలను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. వెంటనే క్రషర్ మిల్లును మూయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, తురక రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

## ఘనంగా టైలర్స్ డే వేడుకలు

కేసముద్రం, ఫిబ్రవరి 28 : కుట్టు మిషన్ కనుగొన్న విలియం హోవే జయంతి సందర్భంగా నిర్వహించే టైలర్స్ డే వేడుకలను శుక్రవారం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సోమ విజయ్‌కుమార్, రాయబారపు సురేందర్, భిక్షపతి, భూమయ్య, భిక్షపతి, శ్రీనివాస్, వీరస్వామి, యాదగిరి, సారంగపాణి, కొమురయ్య ఉన్నారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

డోర్నకల్ : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ఎంఈవో అంగోత్ లక్ష్మా అన్నారు. శుక్రవారం బూర్గుపాడు గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎం రత్నం ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నరసింహారావు, రుక్మాంధరావు, వీరభద్రరావు, ఉపాధ్యాయులు విద్యాసాగర్, ఉష పాల్గొన్నారు.

## ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

దంతాలపల్లి : ఉరేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో శుక్రవారం జరిగింది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. బొడ్లాడకు చెందిన మేకల మల్లయ్య (50) తన ఇంటికి ఎదురుగా ఉన్న ఇంటి యజమానితో పెంపుడు కుక్క విషయంలో గొడవ పడ్డారు. సదరు వ్యక్తి మల్లయ్యను కొట్టడంతో మనస్తాపానికి గురై ఇంటికి సమీపంలో ఉన్న చర్చి వద్ద చెట్టుకు ఉరేసుకొని మృతి చెందారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా అంజయ్య

దంతాలపల్లి : మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా ఎనమల్ల అంజయ్యను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి తెలిపారు. కార్యక్రమంలో మల్లయ్య, భిక్షం, శ్రీను, కుమార రమేశ్, రాములు, మల్లేశ్, నరేందర్ పాల్గొన్నారు.

## ప్రజల చెంతకే వైద్యం

తొర్రూరు, ఫిబ్రవరి 28 : పల్లె దవాఖానల్లో ప్రజల చెంతకే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని వెలికట్ట పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ ఫాతిమాఫరా తెలిపారు. శుక్రవారం వెలికట్ట పల్లె దవాఖానలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పల్లె దవాఖానల్లో 12రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. గర్భిణులు, చిన్న పిల్లలకు బుధ, శనివారాల్లో ఆరోగ్య పరీక్షలు ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్లకొండ వెంకటసాయిలు, ఆశ కార్యకర్తలు జ్యోతి, మాధవి, మైబా పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

కేసముద్రం, ఫిబ్రవరి 28 : భూమి లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందజేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా హరినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పని దినాలతో సంబంధం లేకుండా ఏడాదికి రూ.12వేలు అందించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పేద మహిళలకు సైతం ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు పనులను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ వెంకన్న, గుగులోత్ కౌస్య, జాటోత్ వెంకన్న పాల్గొన్నారు.

## బేకరీలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

బయ్యారం, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని బ్రహ్మలింగేశ్వర బేకరీలో శుక్రవారం ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి రోహిత్‌రెడ్డి తనిఖీలో నిర్వహించారు. ఎగ్‌పఫ్ తయారీలో నాణ్యత పాటించడం లేదని ఫిర్యాదు అందడంతో తనిఖీలు నిర్వహించిన అధికారులు, శాంపిల్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపారు. బేకరీలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో నిర్వాహకులకు నోటీసు అందజేశారు.



నిర్వాహకులకు నోటీసను అందజేస్తున్న రోహిత్‌రెడ్డి

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గార్ల, ఫిబ్రవరి 28 : గోపాలపురం గ్రామానికి చెందిన వడ్డెబోయిన లింగయ్య ఇటీవల మృతి చెందగా, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.22,800 నగదు, 50 కిలోల బియ్యం ఆర్థిక సాయంగా అందజేశారు.

**ప్రకటన**

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అయిన జాటోతు రమేష్, తండ్రి జాటోతు రూప, ఈ దిగువ చూపబడిన షెడ్యూలు దాఖలు గల ఆస్థిని తనఖాగా పెట్టి ఋణము పొదుటకు LIC Housing Finance, హన్మకొండ శాఖ వారిని సంప్రదించినారు. ఇట్టి ఆస్థికి సంబంధించిన లింకుదస్తావేజు అనగా రిజిస్టర్ విక్రయ దస్తావేజు నం.133/1997 అమ్మినవారు. బి.వీరసోములు కొన్నవారు, బి.దేవమ్మ, పోయినవని తెలిపినారు. కావున ఇట్టి లావాదేవీలపై ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 15 రోజులలోగా ఈ దిగువ చూపబడిన అడ్రస్‌కు తెలియజేయగలరు. లేని యెడల ఎటువంటి అభ్యంతరములు లేవని విశ్వసించబడును.

**ఆస్థి షెడ్యూలు:** పురపాలక సంఘం తొర్రూరు, మండలం మరియు మండల పరిషత్తు తొర్రూరు, జిల్లా, జిల్లా పరిషత్తు మహబూబాబాద్, తొర్రూరు పట్టణంలోని ఖాళీ స్థల సర్వే నం.55, 56 మింజులే ఖాళీ స్థల విస్తీరం, 200.00 చ.గ.లు సమము167.22 చ.మీటర్లు ఇందులో ఎలాంటి కట్టడములు, నిర్మాణములు లేవు.

**హద్దులు:**
తూర్పు: 20 ఫీట్ల ప్రపోజుడు రోడ్డు
పడమర: మహమ్మద్ పాషా గారి స్థలము
ఉత్తరం: కారంపురి లక్ష్మణ్‌గారి స్థలము
దక్షిణం: కొత్త శ్రీలక్ష్మి గారి స్థలము

Sd/- **B.B.PRASAD,** B.A., L.L.B
Advocate
#1-7-840/206, Lahari Bharathi, Aparments, Hunter Road, Opp: Warangal Public School, Hanumakonda. Cell: 9849558583

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

**WANTED TEACHERS**
★WANTED TEACHERS For High School Section with B. Ed., & For Primary Section with Graduation. Send your Resume Whatsapp:9949033066/9989429744.
NTW-482

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565